# అమరవీరుల త్యాగం మరువలేనిది

ఖలీల్‌వాడి, నవంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరుల త్యాగాలు మరువలేనివని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద బుధవారం నివాళులర్పించారు. తెలంగాణ అమరువీరుల త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం తెలంగాణ భవన్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి తెలంగాణ తల్లికి పూలమాలలు వేశారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ దీక్ష బూనిన ఘటనను గుర్తుచేశారు. కార్యక్రమంలో ధాత్రిక అంజయ్య, ఆదివాసుల నాయక్‌పోడ్ సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీచైర్మన్ విఠల్‌రావు

## నేడు సంకట హర చతుర్థి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 29 : విఘ్నాలు తొలగించే వినాయకుడికి ఇష్టమైన చతుర్థి తిథి గురువారం పురస్కరించుకొని గణపతి ఆలయాల్లో బుధవారం ప్రత్యేకపూజలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని సార్వజనిక్ గణేశ్ మండలి, కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డులోని గణపతి ఆలయాలతోపాటు ఎన్టీఆర్ చౌరస్తాలోని శుభం కరోతి కల్యాణం గణపతి ఆలయాల్లో ఉదయం 8.30 గంటలకు గణపతి హోమం, రాత్రి 8 గంటలకు మహాహారతి, అన్నప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 29 : నగరంలోని కిషన్‌గంజ్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 52వ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేలేటి దుర్గాప్రసాద్, పశుపతి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు కొనసాగాయి. లోక కల్యాణార్థం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ వీరేశం గుప్తా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని నిర్మించి 52 ఏండ్లు పూర్తయిన సందర్భంగా కార్తీక బహుళ తదియ సందర్భంగా పలు ధార్మిక కార్యక్రమాలతో పాటు కార్తీక సహస్ర దీపోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారి విగ్రహం

# నగరంలో వడగండ్ల వాన

- ఈదురుగాలులకు నేలకొరిగిన స్తంభాలు, చెట్లు
- పలు ప్రాంతాలను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే బిగాల


ఈదురుగాలులకు ఇంటి రేకులు ఎగిరిపోయి చిందరవందరగా పడిన వస్తువులు


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 29 : జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు పెద్దసంఖ్యలో నేలకొరిగాయి. నగరంలోని అసద్‌బాబా, ఇబ్రహీం నగర్ ప్రాంతాల్లో పలు ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. పురాతన ఇండ్లు కూలాయి. పలు ఇండ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఆయా కాలనీల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా బుధవారం పర్యటించారు. కూలిన ఇండ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దండు శేఖర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్ ఆకుల శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మోపాల్ మండలంలోని బోర్గాం (పీ)లో ఉన్న జై భీమ్ నగర్ కాలనీలో పలు గుడిసెలు నేలమట్టం అయ్యాయి. నిజామాబాద్ రూరల్ పరిధిలోని మాధవనగర్‌లో ఉన్న రంజిత్ పౌల్ట్రీఫాంలో సుమారు 100 కోళ్లు వడగండ్ల వానకు మరణించాయి. బాధితులు తమను ఆదుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

# అకాల వర్షంతో నష్టం

- ముల్లంగిలో 250 ఎకరాల్లో దెబ్బ తిన్న పత్తి పంట
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

డిచ్‌పల్లి/ ఇందల్వాయి, నవంబర్ 29 : మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలోని ముల్లంగి(బీ) గ్రామంలో చేతికొచ్చిన పత్తి పంట సుమారు 250 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. వడగండ్ల వానతో పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న పంటలను సర్పంచ్ లావణ్యా మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిన్ననర్సయ్య పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇందల్వాయి మండలకేంద్రంతోపాటు పలుగ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యం, పత్తి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


ముల్లంగిలో దెబ్బ తిన్న పత్తిపంట

# సోషల్ మీడియాపై పోలీసుల నిఘా

- రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరిక



నిజామాబాద్ క్రైం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సంస్థలకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌లతోపాటు ఇతర సోషల్ మీడియాల్లో వివాదాస్పద పోస్టులు పెడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాక్టివ్‌గా ఉంటూ వివిధ వాట్సాప్ గ్రూపుల్లో చేసే పోస్టులపై 24x7 ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నేటి పోలింగ్ సందర్భంగా వాట్సాప్‌లలో ఎలాంటి పోస్టింగ్‌లు పెడుతున్నారనే వాటిపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. వాట్సాప్, టెలిగ్రాంతోపాటు ఇతర సోషల్ మీడియాల్లో మతపరమైన, రెచ్చగొట్టే, వివాదాస్పద పోస్టులు పెట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శిక్షాస్మృతి (ఐపీసీ), ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు సుమారు 10 సంవత్సరాల వరకు కఠిన శిక్షపడే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎవరు కూడా రెచ్చగొట్టే, మతపరమైన పోస్టులు పెట్టవద్దని సూచించారు. వివాదాస్పద పోస్టులు పోస్ట్ చేస్తే డయల్ 100కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

# సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

### బీఆర్ఎస్ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి

డిచ్‌పల్లి, నవంబర్ 29 : బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత పాలకుల హయాంలో సుమారు 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారని అన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లోకి వచ్చి సాధ్యం కాని హామీలను అమలుచేస్తామని ప్రచారం చేసిన కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నమ్మరని తెలిపారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని, ప్రతిపక్ష పార్టీలు ఓటమి భయంతో బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూరల్ నియోజకవర్గ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, గజవాడ జైపాల్, మోహన్‌రెడ్డి, దండుగుల సాయిలు, ఆమీర్, కృష్ణ, నయీం, అంజయ్య, రవికిరణ్, పద్మారావు, నల్లవెల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి

# బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు ఖాయం

### ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్

ధర్పల్లి, నవంబర్ 29 : రూరల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు ఖాయమని ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి గోవర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొమ్మిదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ప్రజలు ఆయనను మరోసారి ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో రూరల్ ఎంతో వెనుకబడి ఉండేదని, ప్రస్తుతం రూరల్‌లో జరిగిన అభివృద్ధి ప్రజలకు స్పష్టంగా తెలుస్తున్నదని తెలిపారు. మరోసారి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు.